**International Journal of Law, Management and Social Science** **ISSN: 2581-3498**

Vol. 2, Issue IV, Oct-Dec, 2018 http://bharatpublication.com/journal-detail.php?jID=35/IJLML

# “*తెరచాటు*” నాటకం – స్త్రీ పాత్రల విశ్లేషణ

# DRAMA “TERACHATU” – ANALYSIS OF FEMALE CHARACTERS

**జి. సుకన్య, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ సిటి డిగ్రీ కళాశాల, హైదరాబాద్.**

**G.Sukanya**

*Lecturer in Telugu, Government City College, Hyderabad*

## ABSTRACT

*A year before India gained independence, in 1946, Joshua Garu wrote the play Terachatu. During that time, theater was one of the closest forms of entertainment and communication with the people. The Prajamitra organization announced a competition for plays in a newspaper, stipulating that the play must not exceed four acts. They also declared a prize of 116 rupees for the best play. Inspired by this announcement and driven by the desire to win the prize, Joshua embarked on writing a four-act play, which resulted in Terachatu.*

*The title itself is revealing—Terachatu refers to the hidden, internal aspects behind the curtain. While Joshua initially wrote this play with the intent of winning the prize, it is remarkable that he chose societal events, women's issues, and their emotions as the central themes, reflecting the conditions of the time.*

స్వాతంత్ర్యం రావడానికి ఒక సంవత్సరం ముందు జాషువా గారు తెరచాటు నాటకాన్ని(1946) రాశారు. నాటి కాలంలో నాటకం ప్రజలకు అతి దగ్గరగా ఉన్న కాలం. అప్పుడు ప్రజామిత్ర సంస్థ వారు నాటక పోటిల కొరకు పత్రికలో ఒక ప్రకటన వేశారు. అయితే ఈ నాటకం కచ్చితంగా నాలుగు అంకాలకు మించకుండా ఉండరాదు అనే నిబంధనలు పెట్టి ఉత్తమ నాటకానికి నూట పదహారు రూపాయల బహుమతి ప్రధానం కుడా ఉంటుందని ప్రకటించడం జరిగింది. ఈ ప్రకటన ప్రేరణ, బహుమతి సాధించాలన్న ఆకాంక్షతో నాలుగు అంకాలతో కూడిన నాటకం రాయడానికి పూనుకున్నాడు అదే తెరచాటు నాటకం. శీర్షికలోనే మనకు అర్థమవుతుంది. తెరచాటు అనగా తెరవెనుక ఉండే అంతర్గతమైన అంశం అని అర్థం. ఇలా జాషువ ఈ నాటకం బహుమతి కోసం రాసిందే అయినా సమాజంలో జరుగుతున్న సంఘటనలను, స్త్రీ సమస్య, వారి మనోభావాలను వంటి నాటి పరిస్థితులనే నాటక వస్తువుగా ఎంచుకోవడం విశేషం.

## స్త్రీ స్వేచ్ఛ

పురాణకాలం నుండి పురుషాధిక్య సమాజంలో స్త్రీ బానిసగానే బ్రతికింది. పతిభక్తి పేరుతో, పాతివ్రత్య పేరుతో స్త్రీ చుట్టూ మాయతెరలు కప్పి, చదువుసంధ్యలకు దూరం చేసి, నాలుగు గోడల మధ్య బంధీగా ఉంచబడింది.

పిల్లల్ని కనడం, పెంచడం ఇంటిల్లిపాదికి చాకిరి చేయడం ఇదే ఆమె జీవితపరమార్థం అయింది. ''ఎక్కడ స్త్రీలు పూజించబడతారో అక్కడ దేవతలు కొలువుంటారు'' అంటూ ఆమెనుశిఖరాగ్రం పై కూర్చోపెట్టారు. నిజానికి స్త్రీకి ఏమైనా మేలు జరిగిందా అంటే దాదాపు శూన్యంగానే భావించవచ్చు. ఈ నాటకంలో కూడా కామశాస్త్రి తన భార్యను ఇంట్లో తాళం వేసి ఉంచి తాను మాత్రం బజార్లు తిరిగి వస్తాడు. ఇక్కడ వీరిద్దరి మధ్య పాత్ర చిత్రణ కింది విధంగా నడుస్తుంది.

**రాజ్యలక్ష్మి** : అవునండీ నన్నింట్లో పెట్టి, బయట తాళం వేసుకుపోతావే ? నేనెలుగు ననుకున్నారా? పులుగు ననుకున్నారా? యింత పాపమెక్కడా లేదే?

**కామశాస్త్రి** : నీకు బయటకు రావల్సిన పనేముంది. కావలసినన్ని తెచ్చి పడవేశాగా, హాయిగా పడుకొని నాకింత పెట్టి నీ వింత తిను రాణిలాగా అంటాడు.

ఇక్కడ రాజలక్ష్మి మనస్సు మనం అర్థం చేసుకోవచ్చు. ఇంట్లో బెట్టి తాళం వేసినా తన భర్తను మాత్రం చాలా మర్యాదగా అవునండీ అంటూ సంభోదిస్తుంది. సమాజంలో స్త్రీ పురుషుడికి భోగం వస్తువులా ఎలా చెబితే అలా ఆడాల్సిందే. ఒక స్త్రీ చావు బతుకుల్లో ఉంటే బతికించుకొవడం మానేసి చస్తే ఇంకో దగ్గర కట్నం తీసుకొవచ్చనే పురుష దురహంకారాన్ని ప్రదర్శిస్తాడు బ్రహ్మశాస్త్రి ఈ నాటకంలో.

**కళ్యాణి** : నాకు లాభం లేకపోతే మీరున్నారుగా వదినా! మిమ్మల్ని చూసి సంతోషించకూడదూ? మా పుణ్యం చేత గాని వదినా! నీవు దక్కుతావనుకున్నామా? పూలు పెట్టుకొని మా కండ్ల పండగ చేస్తావనుకొన్నామా? వదినా? మానాన్న డాక్టరు గారు లాభం లేదనంగనే వాడెవడో సంబందానికి వస్తే కట్నాలు కూడా బేరం చేశాట్ట. ఇంత పాప మొక్కడన్నా యున్నదీ?

**శ్యామల** : హిందూ సంఘమంటే మనుష్యుల్ని ప్రాణాలతో పీక్కుతిను క్రూర పిశాచంగాదా? వెర్రిదానా? ఆడదై పుట్టడమే మహాపాపమనుకో. అందులో బ్రాహ్మణ కొంపల్లో పుట్టడం నీచాతినీచం. ఈ దుర్మార్గులు చేసే పాపాలన్నా యిన్నా పట్టు పురుగుల మీద మహాసున్నితంగా గోమున బెంచిన కన్న కొడుకును, ప్రాణం పోతూయుంటే విసరి నేలమీద పారవేయడమే గాని ఆ మంచం మీద చావనీయరాదూ వీళ్ళపుట్టేం మునుగుతుంది. (పుట: 1002, జాషువ సర్వలభ్య సంకలనం)

అంటూ హిందూ సంస్కృతిని తీవ్రంగా దుయ్యబట్టింది. ముఖ్యంగా బ్రాహ్మణ కులంలో ఇంతటి నీచం మరొక దగ్గర ఉండదు అంటూ స్త్రీకి కనీసం పుట్టినప్పటి నుండి చచ్చేదాక కనీస స్వేచ్ఛ లేకుండా పోయింది. ఈ హిందూ దేశం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అని అన్నారే కాని అవి ఎవరికి లభించింది. అంటూ శ్యామల పాత్ర ద్వారా చాలా చక్కగ చెప్పారు రచయిత.

అలాగే ఈ పురుషాధిక్య సమాజంలో స్త్రీని తక్కువగా చూశారు. తమ అవసరాలకు అన్ని పనులు చేయిస్తూ, హింసా పీడనకు గురిచేస్తూ అసలు మనిషిగనే గుర్తించని సమయాలున్నవి. ఇలా వీరితో పాటు కవులు రచయితలు కూడా అలా చేస్తే ఎలా అంటాడు రచయిత కళ్యాణి ద్వారా. ముఖ్యంగా భావ కవులు స్త్రీని కేంద్రంగా చేసుకొని స్త్రీ చుట్టూ తిరుగుతూ తనే తన ఊహ ప్రేయసి అని చెబుతూ అంగాంగ వర్ణనలు చేస్తూ ఉండటం చూసి ఈ నాటకంలో కళ్యాణి పాత్ర ద్వారా ఇలా పలికిస్తాడు. ‘‘ చూస్తే పద్యం, నడిస్తే పద్యం, పలికితే పద్యం, మా బ్రతుకంతా పద్యమేనా ఆడవాళ్ళనిల్లా బజారు చేస్తునందుకు మీ మీద దావా వేయవచ్చు’’ అని అంటుంది. అలాగే మీరు ఎల్లకాలం మా సౌందర్య వర్ణన్లే రాయవవోతే స్త్రీ స్వాతంత్ర్యం అని ఒక్క నాటకమైనా రాయవచ్చు కదా అని అంటుంది. అనగా స్త్రీని ఎప్పుడు చులకనా భావంతో చూసే కన్నా కవులు, రచయితలు అయిన మీరు స్త్రీకి సమాజంలో అన్ని అవసరాలు కల్పించాలి స్వేచ్ఛా సమానత్వం కావాలి అని ఒక్క నాటకం అయినా రాయవచ్చు కదా అని ప్రశ్నిస్తుంది. దీంతో పాటు స్త్రీని ఇలా అంగాంగ వర్ణణలు చేసినందుకు గాను మీమీద కేసు కుడా పెట్టినా పరవాలేదు అంటుంది. అంటే స్త్రీ ఎంత మానసిక ఒత్తిడికి లోనవుతుందో అర్థం చేసుకోవచ్చు.

**బాల్యవివాహాలు**

ఆనాటి కాలంలో బాల్యవివాహాలు చాలా విస్తృతంగా ఉండేవి. వీటి రద్దుకోసం రాజారాం మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలైన వారు అనేకంగా కృషి చేశారు. అయినా సమాజంలో నేటికి జరుగుతూనే ఉన్నాయి. పుట్టిన బిడ్డకు కనీసం ఏది మంచి ఏది చెడు అని తెలియని వయస్సులో పెళ్ళిళ్ళు చేసి తల్లిదండ్రులు తమ వంతు బాధ్యత అయిపోయిందని చేతులు దులిపేసుకునేవారు. కాని తన బిడ్డ పడుతున్న వేదనను మాత్రం వినిపించుకునే వారు కాదు. అలాగే తల్లిదండ్రుల కనీస ఆప్యాయతను పొందలేక, విద్యా, ఉద్యోగాలకు దూరమై శారీరకంగా బలహీనపడి అనేక ఇబ్బందులకు గురయ్యేవారు. ఇక్కడ కళ్యాణి పాత్ర ద్వారా రచయిత అసలు మొగుడంటే ఎవరు అనే విధంగా ప్రశించిన తీరు చూస్తే ఈమె మేధాశక్తి ఎంతటిదో మనం అర్థం చేసుకోవచ్చు.

**కళ్యాణి** : (గోమునభినయించుచు) అమ్మా నాకు బొట్టు, కాటుక బెట్టుకొని మన దొడ్లో పూలన్నీ పెట్టుకోవాలని యుండే, ఏమే, అమ్మా పెట్టవూ పండగనాడు.

**బుచ్చి** : నువ్వుముండమోశావు తల్లి ముండరాత రాశాడే భగవంతుణ్ణికూ

**కళ్యాణి** : పోద్దూ ముండమోశానా! ఎప్పుడమ్మా! నేనే మ్మోయాలా? మొన్న నా చిన్నబిందెతో నీళ్ళుమోశా?

**బుచ్చి** : కాదే! అమ్మా కాదూ ముండ మోశావంటే నీ మొగుడు చచ్చాడన్నమాట.

**కళ్యాణి** :(జ్ఞాపకం తెచ్చుకొని) ఆ..ఆ వేళ .. ఆ.. వేళా, మామయ్య చచ్చిపోయాడనీ, మీరంతా యేడ్చారే ఆయనా?

**కళ్యాణి** : అమ్మా మామయ్యల్చస్తే ముండమోస్తారుటే? వదినెకూ అన్నయ్య మామౌతాట్టే.

(పుట: 1002, జాషువ సర్వలభ్య సంకలనం)

ఇలా వీరిద్దరి మధ్య చాలా వింత సంభాషణ జరుగుతుంది. ఇక్కడకళ్యాణిని చూస్తుంటే కరుణ రసం ఉద్భవిస్తుంది. మొగుడంటే మామయ్యా, మామయ్య అంటే మొగుడని అడిగిన తీరు చూస్తుంటే ఒక్కోసారి చాలా ఆశ్చర్యం కుడా వేస్తుంది. మానవ సంబధాలు కూడా తెలియని వయస్సులో పెళ్ళిళ్ళు చేసుకొని వారు పడే ఆగచాట్లు చూసి ప్రతి ఒక్కరూ కన్నీరు కార్చాల్సిందే.

**ప్రాచీన సాంప్రదాయాలు :**

పూర్వ కాలం నుండి నేటికి ప్రాచీన సంప్రదాయాలకు ఎక్కువగా ప్రాధాన్యత కన్పిస్తుంది . బంధాలను బంధుత్వాలను తెంచకూడదని పెద్దవాళ్ళలో చాలా బలమైన కోరికలు ఉండేవి. అతడు కాటికి కాళ్ళు చాచేవాడైనా పరవాలేదు కాని తన ఐదారు సంవత్సరాల కూతురుకే తన రక్త సంబందకుల వాన్ని ఇచ్చి పెళ్లి చేయాలనే బలమైన కోరికలు ఉండేవి. ఇలాంటి విషయాలు స్త్రీలు చాలా గుడ్డిగా ఆలోచించేవారు. ఈ నాటకంలో కూడా కళ్యాణికి ఇలాంటి సందర్భం ఎదురవుతుంది.

**శ్యామల** : నేను కాపురానికి వచ్చినేడు నీవు మూడేడ్లదానివి. మీ మేనమామ ఒహాడుండేవాడు. డెబ్బయూండ్లకోతి. పెండ్లమేమో చచ్చిందిట వాడికి. మీ అమ్మ నా అన్నయ్య దూరమై పోతాడు, నా కళ్యాణి అచ్చట ముచ్చట చూచుకుంటానంటూ సాగించింది మీ నాన్న గారితో పోరు బరించలేక సరే యికనేముంది బ్రాహ్మణ్ణి పిలిపించి, శుభముహుర్తం పెట్టింది. కండ్లు తెరవని కసిగందున్నిన్ను వాడి మొహానా పెట్టి నీళ్ళు విడిచారు. అంటు శ్యామల కళ్యాణికి చెబుతుంది'' ఇలాంటి విషయాలు ఆ కాలంలో తల్లిదండ్రుల పట్ల ఉండేవి. (పుట: 1004, జాషువ సర్వలభ్య సంకలనం)

అలాగే సమాజంలో కాల పరిస్థితులకు అనుకులంగా మార్పు అవసరం అలా ఉంటేనే సమాజం ప్రగతి పథంలో నడుస్తుంది. ఎంతసేపు పాత చింతకాయ పచ్చిడి రుచి చూస్తారు. అప్పుడప్పుడు కొత్త రుచులను కూడా ఆశ్వాదించాలి అంటూ తెలుపుతాడు రచయిత. కిషోర్, రామచయనుల మధ్య సంభాషణ ద్వారా మనం అర్థం చేసుకోవచ్చును. కిషోర్ మంచి అభ్యుదయ భావాలు గల వ్యక్తి. రామచయనులు మాత్రం పాత కాలం మనిషి.

**కిషోర్** : అందుకే మీకు తెలియదన్నది. కవి సమయాలకు స్వస్తి చెప్పి చాలా కాలమైంది. మేము వ్రాసేదే ప్రమాణం, సమయమూనూ.

**రామచయనులు** : సరి సరి నాయనా? అది ఆదరణీయమౌతుందా?

**కిషోర్** : ఆదరించే దెవరు? కవి యొకరి ఆదరణకోరడు, కోరాడంటే వాడు కవిగాడని మా సిద్ధాంతం.

**రామచయనులు** : పండితారాదరణ లేదూ?

**కిషోర్** : ఎవడు పండితుడు ! వాడి ఆదరణ యెవరిక్కావాలి! పండితుడంటే మాకు మంట. అతడొక పాతపుంత, తాతలనాటి తాటాకు, ఒక నిఘంటువు, సంస్కృత సరస్సులో నోక యెనుబోతు.

**రామచయనులు** : నీ మాటలు నాకాశ్చర్యంగా యున్నవి.

**కిషోర్** : అవునండీ? మీకు రాళ్ళు గుండ్లు దొర్లించాలి, బోప్పి కట్టించాలి, బంధాలు, అలంకారాలు, సర్కసు ఫీట్లు కావాలి అప్పుడు గాని నచ్చదు.

(పుట: 998, జాషువ సర్వలభ్య సంకలనం)

**వితంతు బాధలు :**

సమాజంలో ఈ నాటక రచనా కాలంలో దానికి ముందు బాల్య వివాహాలు ఎక్కువగా జరిగేవి. అవి ఎవరితో అంటే అరవై డెబ్టై సంవత్సరాల ముసలి వాడితో పది సంవత్సరాల లోపు ఉండే బాలికకు వివాహం చేసేవారు. చేసుకున్న భర్త ఒక ఐదు ఆరు సంవత్సరాలకే మరణించేవాడు. అలా అనేక మంది బాలికలు వితంతువులుగా మారి వారి యవ్వన వయస్సులో అనేక ఇబ్బందులు ఎదుర్కోనవలసి వచ్చేది. ఎదుటివారికి చెప్పుకోలేక, ఒకవేళ చెప్పుకుంటే ఎలా చూస్తారో అనే భయంతో ఉండేవారు. అలాగే వారి అలంకరణ కూడా అందరితో సమానంగా ఉండేది కాదు. కొన్ని సందర్భాల్లో వారి అలంకరణ చూసి కొంత మంది పురుషులు వారిని నా నా ఇబ్బందులకు గురిచేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ నాటకంలో వితంతు స్త్రీ కి వెంట్రుకలు నిండుగా ఉండకూడదు. నుదుటికి బొట్టు ఉండరాదు. కాటుక, పూలు వంటివి ధరించరాదు. దీంతో పాటు మానసిక వేదన.

**కళ్యాణి** : ఇన్నాళ్ళు నాకేమి తెలిసేదికాదుగాని............

**శ్యామల** : ఆ ఆ. ఏంటమ్మా ? చెప్పు

**కళ్యాణి** : రెండేళ్లయింది. రాత్రిర్లు నిద్రపట్టదు వదినా ?

**శ్యామల** : ( ఆకలింపు నభినయించి) అవును తల్లీ? అవును. నీ యౌవనము, నీ చక్కదనము, నీ సుఖము కూకటివేళ్ళతో పెరికి ఆహుతి చేసుకొన్నారీ దుర్మార్గులు. ఈ సంఘశక్తికి కన్నులున్నవి గాని కరుణలేదు. హృదయమున్నది గాని వజ్రకల్పం.

**కళ్యాణి** : వదినా.. అన్నయా నీవు చిలకా – గోరింకల్లాగ యుంటుంటే మా వదినె ఎంత అదృష్టవంతురాలని అనుకొంటా, నే..ను ఎవరితో ముచ్చటాడేదని.. నా చక్కదనము చూచి మురిసే వ్యక్తేదీ? (సంతోషముతో నభినయించుచు) మొన్న నేవదినా !మొన్న నే మీరంతా గుడికెళ్లారే ఆవేళే. అద్దం చూచుకొంటే నా యొల్లు నా కళ్ళు నాకే ముద్దొచ్చింది. (చనువు చూపుచు) కడుపులో పెట్టుకోవాలి సుమా!

**శ్యామల** : కళ్యాణి, నన్ను నమ్మవూ కడుపుచించుకుంటే కాళ్ళమీద వడదూ?

**కళ్యాణి** : ఆపాళంగా మొన్న నాన్నగారమ్మకు తెచ్చిన పట్టుచీరకట్టుకొని, సొమ్ములన్నీ పెట్టుకొన్నా, అబ్బా, ఏమని చెప్పనే వదినా? అప్పుడు నాలోపొంగిపొయిన దుఃఖాన్ని అంతలో ఎక్కణ్ణుంచొచ్చిందో, దయ్యంలాగా మానాయనమ్మ. గబాలున యింటజొరబడి నగలన్నీ తేసేశా, ఆ తొందరమీద కమ్మగూడా గీచుకుపోయింది. చూడు.

(పుట.1003 జాషువ సర్వలభ్య సంకలనం)

అంటూ వితంతు బాధలను రెండు పాత్రల ద్వారా చూపించడం జరిగింది.

**కుల సమస్య :**

ఇందులో కులనిరసన కుడా ప్రధానంగా కనబడుతుంది. ఒకానొక సందర్భంలో భారతీయ సమాజంలో స్త్రీని గురించి మగవాన్ని తిట్టడానికి కూడా, ఆడదాన్ని అడ్డుపెట్టుకొనే దౌర్భాగ్య దేశం నాది అంటాడు ప్రముఖ కవి శిఖామణిగారు. అంటే ఇక్కడ స్త్రీకి సమాజంలో ఎంతటి స్థానం ఉందో అర్థం అవుతుంది. అలాగే సమాజంలోస్త్రీ తో పాటు కులం కూడా ప్రధానంగా అడ్డు ఉంది.

**ప్రమోద్** : ఎందుకు మనం కులంగాదుగా?

**శ్యామల**: రామ రామ కులానికి తెలివితేటల కేమిలంకె ?

**ప్రమోద్** : సరే కులానికో తెలివి, కులానికో రంగు, కులానికో రూపం, మన వారు నిర్ణయిస్తారు.ఇప్పుడుపార్టీలు దెబ్బలాటలు, ద్వేషాలు, యుద్ధాలు వచ్చేదంతా ఈ వర్ణద్వేశం నుంచేగాఇప్పడిటలికి అబ్సీనియకు యుద్ధం.

**శ్యామల**: మళ్ళీ యుద్ద మొచ్చిందా దేనికి

**ప్రమోద్**: ఇంకేముంది నల్ల, తెల్ల రంగులబేధమే. ఇంతటితో యుద్ద మాగదంటున్నారు.

**శ్యామల**: రానివ్వండి అట్లనన్నా నాశనమవుతుంది పాడు భూమి.

(పుట. 981 జాషువ సర్వ లభ్య రచనల సంకలనం)

అంటూ కుల నిరసన చేస్తుంది.

**బ్రహ్మశాస్త్రి** : పెధవకొంపైపోయింది. పెధవకొంప(భార్య నుద్దేశించి) పొద్దువారి పోయిందే. ఒశేవు. ఆచార్యుల వారునాలుగుమార్లు కబురంపాడు. ఈ ప్రమోదుడెక్కడ చచ్చాడూ? వీడి పెత్తనాలేమో? వీడేమో? స్నానం లేదు సంధ్యలేదు. మాల పెధవల్తోస్నేహం. మైల గుడ్డల్తో యింట్లో జొరబడడం. వీడిమూలాన పావన మైన నా ఆచారం గంగపాలౌతుంది.

.........................................

**బ్రహ్మశాస్త్రి** : ఛీ భ్రష్టముండా, మాలముండా వాగుతావు మళ్ళా(అని పండ్లు గొరకి)నువ్వే కొంపకు చేటయ్యావు.(పుట.1005,1006)

స్త్రీని తిట్టే సందర్భంలో నీచంగా పిలవబడే కులం పేరు పెట్టి అగ్ర కులస్తులు తిట్టిన సందర్భం మనకు పై సంభాషణ ద్వారా మనకు అర్థమవుతుంది.సమాజంలో స్త్రీ, దాంతో పాటు కులం ద్వారా దేశాల మధ్య యుద్దాలు జరుగుతున్నాయి అని ఈ దేశం యద్దాలతో నాశనమైనంక నన్నా కుల రహిత సమాజంగా ఉంటుందని శ్యామల పాత్ర ద్వారా అర్థమవుతుంది.

**ముగింపు**

గుర్రం జాషువా స్వాతంత్ర్య పూర్వ కాలంలో స్త్రీల మనోవేదనను తెరచాటు నాటకంలో చాలా అద్భుతంగా చిత్రీకరించారు. ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందని అంటూనే స్త్రీని ఇంటి పనులకే పరిమితం చేసింది ఈ సమాజం. ఆదిమ జాతుల స్త్రీలను గృహకార్యక్రమాల్లో పెట్టుకొని బానిసలుగా చేసుకొని శ్రమదోపిడిపి, శారీరక హింసలకు గురిచేయడం దాసీలుగా ఉంచిన సందర్భాలు మనకు అనేకంగా కన్పిస్తున్నాయి. అలాగే సాహిత్య చరిత్రలో ప్రతి ప్రక్రియలో స్త్రీ లేకుండా ఏ రచనా వెలువడలేదు. అయినా స్త్రీకి అంతటా అన్యాయమే. అలాగే స్వాతంత్ర్యం పూర్వం కూడా నాటక సాహిత్యం సమాజంలో ప్రజలకు ప్రతీకగా నిలిచింది. సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాలను రచయితలు ప్రజలకు దృశ్యరూపంలో రంగురంగుల అభినయాలతో నాటక సాహిత్యం విస్తృత వ్యాప్తి చెందింది. ఈ క్రమంలోనే జాషువ తెరచాటు నాటకంలో స్త్రీని పుట్టినప్పటి నుండి బాల్యం, యవ్వనం, వృద్దాప్యం వరకు జీవనం ఎలా కొనసాగుతుందో కళ్యాణి, శ్యామల, బుచ్చిరామమ్మ పాత్రల ద్వారా వారి బాధలను తెలిపారు. అలాగే ఒక బ్రహ్మణ కుటుంబ పరిస్థితులు, ముసలి మొగుళ్ళు, పడుచు పెళ్ళాళ

పరిస్థితులను చక్కగ కళ్ళకు కంట్టినట్లు చూపించారు. ఇలా మొత్తంగా ఈ నాటకం ఒక గ్రామంలో కుటుంబ జీవనానికి దర్పణంగా అనేక కోణాల నుండి చూపించారు.

**ఉపయుక్తగ్రంథ సూచి (References)**


1. గంగప్ప. ఎస్. 1985, *తెలుగు నాటకం*, శశి ప్రచురణ, శ్రీనివాస్ నగర్, గుంటూరు,522006.

   (Gangappa. S.1985, Telugu Naatakam, Shashi Prachurana, Srinivas Nagar, Guntur, 522006.)
2. రమణ.పి.వి. 1995, *తెలుగు సాంఘీక నాటకం పరిణామ వికాసం*, వెంకటరమణ బ్రదర్స పబ్లిషర్స్ అండ్ సెల్లర్స్. వరంగల్.

   (Ramana P. V. 1995, Telugu Saanghika Naatakam Parinaama Vikaasam, Venkata Ramana Brothers Publisher's and sellers, Warangal.)
3. రాయుడు.యం.వి, శ్యామనారాయణ.టి, *జాషువ (జాషువ సర్వలభ్య రచనల సంకలనం)*, మనసు ఫౌండేషన్,40, జె.సి. ఇండస్ట్రియల్ ఏరియా, కనకపుర రోడ్, బెంగుళూరు- 560 062. (Raayudu M.V. Shyaama Narayana.T, Jaashuva (Jaashuva Sarva labhya Rachanala Sankalanam) Manasu foundation, 40, J.C. Industrial area, Kanakapura Road, Bangalore - 560062.)